


ఊరేగింపుగా వెళ్లి..

- బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

శ్రీవారి సేనాధిపతిగా పిలిచే విష్వక్సేనుడు విశేష అలంకరణతో, గదతో తిరుచ్చి వాహనం అధిరోహించారు. గురువారం సాయంత్రం ఏడు గంటలకు ఆలయం వెలుపలకు ఊరేగింపుగా వచ్చారు. మహద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మాడవీధుల్లో బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ సందర్భంగా సేనాధిపతి ఊరేగింపు నిర్వహించారు.



మరోవైపు ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. ఆ తర్వాత సేనాధిపతి ఊరేగింపు అనంతరం ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన పుట్టమన్నును కుండలలో వేశారు. శాలి, వ్రహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. తర్వాత సోమరాజ మంత్రం, వరుణ మంత్రం, విష్ణుసూక్తం పఠించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఇలా వైఖానస ఆగమోక్తంగా అంకురార్పణ ఘట్టాన్ని నిర్వహించారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్టం ఉద్దేశం. అంకురార్పణలో చల్లిన విత్తనాలు బాగా మొలకెత్తడం వల్ల ఉత్సవాలు కూడా గొప్పగా జరుగుతాయని భక్తుల విశ్వాసం. ఈ అంకురార్పణ కార్యక్రమంలో టీటీడీ ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్, డిప్యూటీఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



ఇది భగవంతుడి సమయం



అన్ని మతాలను గౌరవిస్తా

సనాతన ధర్మంపై దాడి చేస్తామంటే ఊరుకోను

'వారాహి డిక్లరేషన్' సభలో పవన్

'ఇది ఎన్నికల సమయం కాదు. సినిమా సమయం అంతకన్నా కాదు. భగవంతుడి సమయం. ఇస్లాం సమాజాన్ని చూసి నేర్చుకోండి. వాళ్లు 'అల్లాహ్' అంటే ఆగిపోతారు. మనం 'గోవిందా' అన్నా ఆగం. నేను మీతో చప్పట్లు కొట్టించుకోవాడానికో, జేజేల కోసమో రాలేదు. సనాతన ధర్మాన్ని మట్టిలో కలిపేస్తామన్న వారితో గొడవ పెట్టుకునేందుకువచ్చా' అంటూ వారాహి డిక్లరేషన్ సభ ఉద్దేశ్యాన్ని స్పష్టం చేశారు జనసేనాని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. తన ప్రసంగం కోసం యువత ఈలలు, కేకలతో కేరింతలు కొడుతుండగా, ఆయన ఈ వ్యాఖ్యలు చేయడంతో సభ ఒక్కసారిగా మౌనం దాల్చింది. తిరుపతిలోని పూలే విగ్రహం వద్ద గురువారం సాయంత్రం 6 గంటలకు జరిగిన సభలో ఆయన ప్రసంగించారు. 'ఇస్లాం, క్రిస్టియన్, సిక్కు, జైన్.. ఇలా అన్ని మతాలు, వారి ధర్మాలను గౌరవిస్తా. అయితే సనాతన ధర్మంపై ఇష్టమొచ్చినట్టు దాడిచేస్తానంటే మౌనంగా కూర్చోలేను. నన్ను వ్యక్తిగతంగా తిట్టినా, అవమానపరిచినా మాట్లాడలేదు. కలియుగదైవానికి కూడా అపచారం జరిగితే మెత్తగా ఎలా ఊరుకుంటా'నంటూ తనదైన శైలిలో హెచ్చరికలు చేశారు. 'సనాతన ధర్మంలాంటి వైరస్‌ను అంతం చేయాలి' అని చెప్పిన తమిళనాడు రాష్ట్ర డిప్యూటీ సీఎం ఉదయనిధికి తమిళ భాషలోనే కౌంటర్ ఇచ్చారు. ఇతర మతాలపై ఈ వ్యాఖ్యలు చేస్తే స్పందించే న్యాయస్థానాలు... సనాతన ధర్మంపై మాట్లాడితే మౌనంగా ఉంటున్నాయని ఇంగ్లీషులో తన అసంతృప్తి వ్యక్తం చేశారు. అయోధ్య రామాలయంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను తప్పుబడుతూ సూడో సెక్యులరిస్టులంటూ హిందీలో మాట్లాడారు. 'కొండెక్కి అరచేతిలో హారతి వెలిగించుకునే మీ డ్రామాలు తెలియవా? ఆ నాటకాలకు తగిన మూల్యం చెల్లించేది దేవుడొక్కడే! ఆయన నిజరూప దర్శనం రోజు అప్పుడంతా తెలుస్తుంది' అంటూ టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డిపై పవన్ మండిపడ్డారు. 'తన హయాంలో కల్తీ నెయ్యిపై ఇంత జరుగుతున్నా మాజీ ఈవో ధర్మారెడ్డి స్పందించకుండా ఏమయ్యారు? కొడుకు చనిపోయిన 15రోజులకే ఎలా ఆలయంలోకి వస్తారు?' అంటూ ప్రశ్నించారు. ఇలా సనాతన ధర్మం.. ఈ విషయంలో గత ప్రభుత్వ తప్పిదాలు.. వారాహి డిక్లరేషన్‌పైనే పవన్ ప్రసంగం సాగింది. స్థానిక సమస్యలు, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలేవీ ప్రస్తావించలేదు. సభలో యువత, అభిమానులు ఎక్కువగా కనిపించారు. ఇక, సభ ప్రారంభంలోనూ పక్కన ఉన్న కూటమి నాయకుల పేర్లు కూడా చెప్పకపోవడం వారిని అసంతృప్తి పరిచింది.వారాహి వాహనంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, జనసేన నేతలు, ఎమ్మెల్సీ హరిప్రసాద్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీజేపీ నేత భాను ప్రకాష్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆరణి కుమారులు మదన్, జగన్ ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మను వాహనంపైకి పిలిచినప్పటికీ ఎక్కకుండా ఆమె వెళ్లిపోయారు.

> 'పవన్ ఉన్నాడంటే వెంకన్న దయ. మా తల్లి నాకు అన్నప్రాసనం చేసిందీ తిరుమల కొండపైనే. ఇక్కడి బాలాజీ కాలనీలో యోగిని రాజేశ్వరిదేవి దగ్గర యోగాభ్యాసం చేశా.'

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

బయోమెట్రిక్ ద్వారా గదుల కేటాయింపు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలోని వసతిగృహాల్లో గదులను బయోమెట్రిక్ ద్వారా కేటాయించనున్నట్లు ఈవో చంద్రశేఖర్ ఆజాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఆర్వో కార్యాలయం వద్ద, వసతి సముదాయంలో కానీ గదులను బుక్ చేసుకోవచ్చన్నారు. ఆధార్ కార్డు, ఏదైనా ఇతరగుర్తింపు కార్డులతో స్వయంగా బుక్ చేసుకోవాలని తెలిపారు.

కూలిన మినీ బస్‌షెల్టర్



తిరుపతి అర్బన్, అక్టోబరు 3: కరకంబాడి రోడ్డులోని అత్తూరు డాబా వద్ద నున్న మినీ బస్ షెల్టర్ గురువారం కుప్పకూలింది. తరచూ వర్షాల కారణంగా పూర్తిగా తుప్పుపట్టిపోయిన ఇనుప స్తంభాలు విరిగిపోవడంతో పడిపోయింది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. నగరంలోని పలు బస్ షెల్టర్లు ఇదే స్థితిలో ఉన్నాయని, నగర పాలక సంస్థ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

టీటీడీ డెయిరీ ఏర్పాటు చేయాలి



సమావేశంలో తిరుమల యాదవ సంఘ సభ్యులు

తిరుపతి (లీలామహాల్), అక్టోబరు 3: తిరుమల లడ్డూ తయారీకి నాణ్యమైన నెయ్యి కోసం టీటీడీ డెయిరీ ఏర్పాటు చేయాలని తిరుమల యాదవ సంఘ అధ్యక్షుడు శీను యాదవ్ కోరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ శ్రీవారి ప్రసాదాల కల్తీ వ్యవహారాన్ని దృష్టిలో ఉంచుకుని బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ టీటీడీ డెయిరీ ఏర్పాటుపై అధికారులకు విన్నవించడమేగాక వెయ్యి గోవులు ఇస్తానని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ఆ మేరకు టీటీడీ చర్యలు తీసుకోవాలని కోరారు. తిరుమలలో డెయిరీ ఏర్పాటు చేస్తే శ్రీవారి భక్తుల భాగస్వామ్యంతో అభివృద్ధి చేసుకోవచ్చునని తెలిపారు. తద్వారా ఇలాంటి విమర్శలకు తావులేకుండా చేయవచ్చునని పేర్కొన్నారు. సమావేశంలో రమణయాదవ్, చంద్ర, మోసమయ్య, చెంగల్రాయులు, ధన పాల్గొన్నారు.

అందరి సమన్వయంతో గ్రామాభివృద్ధి

దుర్గసముద్రం గ్రామసభలో వక్తలు



తిరుపతిరూరల్, అక్టోబరు 3: రాజకీయాలకతీతంగా అందరి సమన్వయంతో పంచాయతీని మరింత అభివృద్ధి చేసుకుందామని దుర్గసముద్రం గ్రామ సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి, గ్రామానికి చెందిన టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి యు.మునిశేఖర్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి మనోజ్ఞ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తులు మాట్లాడుతూ పంచాయతీలో పలుచోట్ల వాటర్‌లైన్ లీకేజీ, పడిపోయ్యే దశలో ఉన్న విద్యుత్ స్తంభాలు, సచివాలయం వరకు సిమెంటు రోడ్డు నిర్మాణం, ప్రైవేట్ కళాశాల నుంచి రోడ్డుపైకి చేరుతున్న మురుగునీరు, వీధి దీపాల సమస్యలను సభ దృష్టికి తీసుకొచ్చారు. అలాగే సప్లై ఛానల్స్‌ను పునరుద్ధరించుకోవాల్సిన అవసరముందని వివరించారు. కాగా గ్రామానికి చెందిన శంకర్ ఆనందరెడ్డి మాట్లాడుతూ ఆర్వోప్లాంటు నిర్వహణకు, పంచాయతీలో పనిచేసే సిబ్బంది నియామకాలకు తీర్మానాలు చేశారా..? చెత్తసేకరణ వాహనానికి టెండరు విధానాన్ని పాటించారా అన్న అంశాలపై వివరాలు ఇవ్వాలని కార్యదర్శిని కోరారు. వీఆర్వో రమేష్, సచివాలయ సిబ్బంది, వివిధ శాఖల ఉద్యోగులు పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు పంచాయతీల్లోనూ గ్రామ సభలు నిర్వహించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



హేమంత్‌కుమార్ (ఫైల్ ఫొటో), బావిలో మృతదేహం

చంద్రగిరి, అక్టోబరు 3: చంద్రగిరికి చెందిన యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. చంద్రగిరి పంచాయతీ ద్వారకానగర్‌కు చెందిన శ్రీనివాసులు, వరలక్ష్మి దంపతుల కుమారుడు హేమంత్ కుమార్(22) ఇందిరమ్మ కాలనీ వద్దవున్న ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్నాడు. రెండు రోజులుగా అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గాలించడం మొదలుపెట్టారు. గురువారం బుచ్చినాయుడుపల్లె గ్రామస్తులు వ్యవసాయి బావిలో గుర్తు తెలియని యువకుడి మృతదేహం ఉందని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. హేమంత్ కుమార్‌గా గుర్తించి, పోస్టుమార్టానికి తరలించారు. తల్లి వరలక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల తోటలపై దృష్టి సారించండి



భీమవరం పరిసర గ్రామాలలో పంటలను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రగిరి, అక్టోబరు 3: రైతులు పండ్ల తోటలపై దృష్టి సారించాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి దశరథరామిరెడ్డి అన్నారు. గురువారం చంద్రగిరి మండలం భీమవరం పరిసర గ్రామాలలో ఈ పంట ద్వారా నమోదు చేసిన ఉద్యాన పంటలను క్షేత్ర స్థాయిలో తనిఖీ చేశారు. కూరగాయలు, పూల తోటలను డ్రిప్ పద్ధతిలో సాగు చేయడం వల్ల అధిక దిగుబడి సాధించవచ్చనన్నారు. సాగుకు ఉద్యానవన శాఖ రాయితీలు ఇస్తోందని, రైతులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మండల ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ, రైతుసేవా కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

పాకాల : మండలంలోని వల్లివేడు పంచాయతీలో ఉద్యాన అధికారి బి.దశరథరామిరెడ్డి, ఉద్యాన అధికారిణి ఎస్.శైలజ ఉద్యాన పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ పంటలు సాగు చేయడం ద్వారా వచ్చే రాయితీల గురించి రైతులకు వివరించారు.

ఎంబీయూలో నేడు మోహనమంత్ర ప్రారంభం

చంద్రగిరి, అక్టోబరు 3: మండలంలోని మోహన్ బాబు విశ్వవిద్యాలయంలో శుక్రవారం మోహన మంత్ర కార్యక్రమం ప్రారంభమవుతుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి విద్యార్థులు పేర్లు నమోదు చేసుకున్నారు. 20 వేల మందికి పైగా విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించనున్నారు. ప్రముఖ గాయకుడు రేవంత్ లైవ్ బ్యాండ్ ప్రత్యేకతగా నిలవనుంది. డీజే నైట్స్‌లో మధ్యప్రదేశ్ నుంచి డీజే పారా నాక్స్ నెదర్‌ల్యాండ్ నుంచి ప్రఖ్యాత సింగర్ డీజే ఫంక్ పాల్గొంటారు. ప్రధాన పోషకుడిగా ఎంబీయూ ప్రొ ఛాన్సలర్ మంచు విష్ణు వ్యవహరించనున్నారు. అధ్యక్షులుగా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వినయ్ మహేశ్వరి, వైస్ ఛాన్సలర్ నాగరాజరామ రావ్, చీఫ్ గ్రోత్, స్ట్రాటజిక్ ఆఫీసర్ వికాస్ సింగ్ వ్యవహరిస్తున్నారు.



ఎల్లమ్మ ఆలయానికి నూతన గొడుగులను తీసుకొస్తున్న దాతలు - విశేషాలంకరణలో సంతోషిమాత - శైలిపుత్రి అలంకరణలో దర్శనమిస్తున్న ఉగ్రప్రత్యంగిరాదేవి

మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

చంద్రగిరి, అక్టోబరు 3: చంద్రగిరి మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో దేవీనవరాత్రి ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. ఉదయం 8.30 నుంచి 9.13 గంటలకు మధ్య తులా లగ్నంలో కలశస్థాపనతో ప్రారంభించారు. వేకువ జామున అమ్మవారికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారి వాహన సేవలో ఉపయోగించే గొడుగులను చంద్రగిరికి చెందిన ఆడిటర్ దామోదర్ రెడ్డి, నీలమ్మ కుమారులు మస్తాన్‌నాయుడు, సుజాత, జీవన్, ధృవన్, ముని సాయికుమార్, ఎంపీటీసీ చంద్రమౌళి రెడ్డి, ఐతేపల్లికి చెందిన రాణి, మండపంపల్లికి చెందిన కాంసాని రాజారెడ్డి అందజేశారు. ఈవో రామకృష్ణారెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు గోపాల్ రెడ్డి, గోపి, వెంకటముని, దుర్గా, మునికృష్ణమనాయుడు, పాపమ్మ, భారతి, దేవి, టీడీపీ నేతలు కాపువీధి సునీల్ పాల్గొన్నారు. కాగా, శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయ ఆవరణలోని సంతోషిమాతకు గణపతిపూజ, యమునాపూజ, కలశ స్థాపన, సహస్రనామార్చన చేశారు. తొండవాడలోని ఉగ్రప్రత్యంగిరా కాళి ఆలయంలో విశేష పూజలు చేశారు. అనంతరం అమ్మవారి ఉత్సవమూర్తిని శైలిపుత్రి అలంకరణ చేసి, కొలువుదీర్చారు. భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి పాల్గొన్నారు.

తిరుచానూరు- నారాయణాద్రి రోడ్డు సుందరీకరణ

చెత్తకుప్పలు తొలగించి.. మొక్కలు నాటి బాగు చేస్తున్న పంచాయతీ అధికారులు



చెత్తకుప్పలు తొలగించి పనులు చేపట్టారిలా..

తిరుచానూరు, అక్టోబరు 3 : తిరుచానూరు నుంచి నారాయణాద్రి(రేణిగుంటరోడ్డు) ఆస్పత్రికి వెళ్లే రోడ్డును పంచాయతీ అధికారులు సుందరీకరణగా తీర్చిదిద్దుతున్నారు. ఈ రోడ్డు పక్కన పదేళ్లుగా వ్యర్థాలను డంప్ చేస్తున్నారు. దుర్గంధంతో ప్రజలు, భక్తులు ముక్కు మూసుకొని వెళ్లాల్సి వచ్చేది. ఈ క్రమంలో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి సుశీలాదేవి స్పందించి చెత్తా చెదారాన్ని తొలగించి సుందరీకరణ పనులు చేపట్టాలని అధికారులకు సూచించారు. పంచాయతీ పాలకవర్గం, కార్యదర్శి శివశంకర్‌రాజు ఆధ్వర్యంలో రోడ్డుపక్కన ఉన్న చెత్తకుప్పలు తొలగించారు. ఎర్రమట్టి తోలి శుభ్రం చేయించారు. గాంధీ జయంతి సందర్భంగా కలెక్టర్ వెంకటేశ్వర్ మొక్కలు నాటారు. కొన్నేళ్లుగా చెత్తను డంప్ చేయడం వల్ల ఈ ప్రాంతం డంపింగ్‌యార్డులా మారిందని కలెక్టర్ పేర్కొన్నారు. 20 రోజులుగా పంచాయతీ సిబ్బంది, పారిశుధ్య కార్మికులు డీపీవో ఆధ్వర్యంలో సవాల్‌గా తీసుకుని 2,015 టన్నుల చెత్తను తొలగించారన్నారు. ఇక్కడ చెత్త వేయకూడదనే ఉద్దేశంతో మొక్కలను నాటామన్నారు. ఇక్కడ చెత్త వేస్తే జరిమానా విధిస్తారన్నారు. పారిశుధ్య కార్మికులను సన్మానించి మొక్కలను నాటారు. కలెక్టర్‌ను టీడీపీ నేతలు అమిలినేని మధు, మధుశేఖర్, కిషోర్‌రెడ్డి, సాయిరాయల్, హరేరామ్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. డీపీవో సుశీలాదేవి, డీఎల్‌పీవో రూపాదేవి, ఎంపీడీవో రమేష్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజు, పారిశుధ్య కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామసభలో సమస్యలపై చర్చ



గ్రామసభలో మాట్లాడుతున్న ఈవో మోతి

పాకాల, అక్టోబరు 3: పాకాల పంచాయతీలో సర్పంచ్ కస్తూరి అధ్యక్షతన గురువారం నిర్వహించిన గ్రామసభలో పలు అంశాలపై చర్చించారు. ఉపాధి హామీ పథకం పనుల గురించి చర్చించారు. హౌసింగ్‌లో ఇంటి నిర్మాణం, పరిసరాల శుభ్రత, చెత్త సేకరణ వంటి విషయాలపై చర్చించారు. ఈవో మోతి, టీడీపీ నాయకుడు రావిళ్ల మోహన్, డి.మోహన్ చౌదరి, డేవిడ్ సురేష్, ఉప సర్పంచ్ ప్రకాష్, వార్డు సభ్యులు, ఎంపీటీసీ సభ్యులు, వెలుగు మహిళ గ్రూపు సభ్యులు పాల్గొన్నారు.

తల్లి మరణం తట్టుకోలేక.. గుండెపోటుతో కుమారుడి మృతి

రాయలపురంలో విషాదం



మృతదేహాల వద్ద విలపిస్తున్న కుటుంబీకులు, మునెమ్మ, రమేష్ (ఫైల్‌ఫొటోలు)

చంద్రగిరి, అక్టోబరు 3: తల్లి మరణం తట్టుకోలేక తనయుడు గుండెపోటుతో మృతిచెందిన ఘటన మండలంలోని రాయలపురం గ్రామంలో గురువారం చో టుచేసుకుంది. గ్రామానికి చెందిన నక్కల మునెమ్మ(65) కొంతకాలంగా అనారో గ్యంతో బాధపడుతోంది. ఆమెకు ప్రభాకర్, రమేష్ బాబు, వేలు కుమా రులు ఉన్నారు. మునెమ్మ గురువారం సాయంత్రం మృతి చెందింది. కుమారుడు రమేష్(48) తల్లి మృత దేహంపై పడి బోరున విలపిస్తూ గుండెపోటుకు గు రయ్యాడు. కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మా ర్గం మధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య వసంతమ్మ, కుమార్తెలు అపర్ణ, అఖిల, కుమారుడు నిరంజన్ ఉన్నారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. అంత్యక్రియలు శుక్రవారం నిర్వహించ నున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మద్యం షాపుల ఆన్‌లైన్ టెండర్లకు 'సర్వర్' కష్టాలు

ఎక్సైజ్ స్టేషన్ల వద్ద దాఖలుకూ సమస్యలు ● టెండరుదారుల ఆందోళన

తిరుపతి(నేరవిభాగం),అక్టోబరు 3: మద్యం షాపులకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు దాఖలు చేయడానికి సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. సర్వర్ పని చేయకపోవడం, వెబ్‌సైట్‌లో సరైన స్పష్టత అధికారులు ఇవ్వక పోవడం, టెండరుదారులకు అవగాహన కల్పించడంలో ఎక్సైజ్ అధికారుల చొరవ చూపకపోవడంతో నానా తిప్పలు పడుతున్నారు. ఇక, జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో సిబ్బంది కొరత వేధిస్తోంది. ప్రతి స్టేషన్‌లో టెండర్లు దాఖలు చేసే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. అయితే ఎక్సైజ్ స్టేషన్లలో ఆన్‌లైన్ వ్యవస్థపైన పట్టులేకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉండకపోవడంతో టెండరు దారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి అర్బన్ స్టేషన్‌లో కనీసం కంప్యూటర్‌పైన పట్టు వున్న సిబ్బంది ఒక్కరూ లేకపోవడం గమనార్హం. దీంతో కౌంటర్ల వద్ద నియమించిన డిజిటల్ అసిస్టెంట్, ఎస్‌బీఐ ప్రతినిధిపైనే ఆధారపడి టెండర్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో మూడు రోజులుగా ఆశించిన స్థాయిలో టెండర్లు దాఖలు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి, రూరల్, శ్రీకాళహస్తి స్టేషన్లలో కనీసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలి. ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు వుండాలి. చలానాలు కట్టించుకుని బ్యాంకులో ప్రభుత్వ ఖజానాకు టెండరు దాఖలు ఫీజు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే గడువులోగా టెండర్లు దాఖలు చేయలేమని టెండరుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం మూడు టెండర్లు మాత్రమే దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. ఇక, గురువారం నాటికి తిరుపతి అర్బన్ పరిధిలో ఆరు మద్యం దుకాణాలకు గాను 8 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయని జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా టెండర్లు దాఖలు చేయలేదన్నారు. కాగా, టెండర్ల దాఖలులో ఎదురవుతున్న సమస్యలపై ఈఎస్‌ను వివరణ కోరగా.. డిమాండును బట్టి ఒక్కో స్టేషన్‌లో రెండు నుంచి మూడు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం టెండర్లు అనుకున్న స్థాయిలో దాఖలు కాక పోవడంతో మౌళిక వసతులు కల్పించే విషయంలో ఆలోచిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బందిలో అవగాహన ఉన్న వారిని నియమిస్తున్నట్లు చెప్పారు. టెండరుదారులలో ఎవరికైనా సందేహాలుంటే సంబంధిత సీఐలను కలసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఆయనను కదిలించాలంటే అంత ఈజీ కాదు

● పదేళ్లుగా తిరుపతి అర్బన్ కార్యాలయంలోనే విధులు

తిరుపతి, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుపతి అర్బన్ తహసీల్దారు కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారు (రీ-సర్వే)గా పనిచేస్తున్న అధికారిపై రెవెన్యూ శాఖ ప్రత్యేకమైన ప్రేమను చూపిస్తున్నట్టుంది. పదేళ్లకుపైగా అదే కార్యాలయంలో వివిధ హోదాలో పనిచేసిన ఆయన్ను.. తాజా బదిలీల్లోనూ రీసర్వే డీటీ నుంచి ఎలక్షన్ డీటీగా కేవలం పక్కసీటుకు మాత్రమే మార్చారు. తనకున్న రాజకీయ, అధికార బలంతో వీఆర్వోగా బాధ్యతలు చేపట్టినప్పటినుంచి అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని విడిచిపెట్టకుండా ఉన్నారు. పైగా ప్రస్తుతం దీర్ఘకాలిక సెలవుపై అమెరికాలో ఉంటున్నప్పటికీ బదిలీల్లో అతనికిచ్చిన ప్రాధాన్యం చూసి సహచర ఉద్యోగులు నివ్వెరపోతున్నారు. వాస్తవానికి దీర్ఘకాలిక సెలవులో ఉన్న ఉద్యోగి, తన సెలవులు ముగిసిన తర్వాత బదిలీచేస్తారు. అలాకాకుండా అదే కార్యాయంలో కేవలం పక్కసీటుకే బదిలీచేయడం విమర్శలకు తావిస్తోంది. పైగా ఈడీటీగా పనిచేసేందుకు కూడా ఆసక్తిగా లేరని, పూర్వపు రీసర్వే డీటీగానే కొనసాగేందుకు ఆయన పైరవీలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అతడి కుమారుడు డిప్యూటీ కలెక్టర్ హోదాలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వద్ద పనిచేస్తుండడంతోనే రెవెన్యూ ఉన్నతాధికారులు బదిలీపై జాగ్రత్తలు తీసుకుంటున్నారన్న చర్చ జరుగుతోంది. గత నెల 27న వచ్చిన ఉత్తర్వులు ఎలక్షన్ డీటీగా పనిచేస్తున్న అధికారిని ఇప్పటికీ రిలీవ్ చేయకపోవడం పలు విమర్శలకు తావిస్తోంది. ఆయన తన బదిలీని పదిలం చేసుకోవడమే కాకుండా మరికొంతమందికి సిఫారసు కూడా చేసినట్టు సమాచారం. ఇదిలావుంటే గత వైసీపీ ప్రభుత్వంలో కొంకా చెన్నాయగుంట, పాన్ చెరువు, ఖాదీ స్థలం తదితర చోట్ల ఆక్రమణలు చేపట్టిన వైసీపీ నేతల వెనుక సదరు అధికారి ఉన్నట్టు ప్రచారముంది.

ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పునఃపరిశీలనలో వేగం

● 10వ తేదీకి నివేదికలు అందించేందుకు సన్నద్ధం ● పుత్తూరు మండలంలో 727 ఎకరాల భూమి



రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్

పుత్తూరు అర్బన్, అక్టోబరు 3: ఈ నెల 10వ తేదీ లోపు ఫ్రీ హోల్డ్ భూముల వివరాలపై కలెక్టర్‌కు నివేదికలు పంపేం దుకు పుత్తూరు రెవెన్యూ అధికారులు వేగం పెంచారు. గత ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఫ్రీ హోల్డ్ భూముల విషయమై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అవకతవకలు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లను నిలిపివేస్తే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఫ్రీ హోల్డ్ చేసిన భూమలకు సంబంధించి ప్రతి సర్వే నెంబర్‌ను పరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అసైన్ చేసి 20 ఏళ్లు దాటిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ పుత్తూరు మండలంలో 12 గ్రామాలలో కేటాయించిన 727 ఎకరాల భూ రికార్డుల పరిశీలన సాగుతోంది. చెర్లోపల్లిలో 7 ఎకరాలు, నందిమంగళంలో 27 ఎకరాలు, నేసునూరులో 32, తిరుమల కుప్పంలో 112, తొరూర్‌లో 25, ఈశ్వరపురంలో 138 , తడుకులో 57, పుత్తూరులో 14, కళింకుప్పంలో 55 , కేబీఆర్ పురంలో 257, ఉత్తర కండ్రిగ, వేపగుంటలో 1.54 ఎకరాల భూమిని 607 మంది లబ్ధిదారులకు ఫ్రీ హోల్డ్ కింద కేటాయించారు. ఈ రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్‌కు, ఇతర సిబ్బందికి దిమ్మతిరిగేలా వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. అడంగల్, 1-బి రికార్డుల్లో నమోదు లేకుండానే ఫ్రీ హోల్డ్ కేటాయింపులు జరిగినట్లు గుర్తిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి రికార్డును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించి ఫ్రీ హోల్డ్ కేటాయింపులు చేసిన అధికారులపై వేటు పడే అవకాశం లేకపోలేదు.

మద్యం షాపులకు దరఖాస్తుల స్వీకరణ

చంద్రగిరి, అక్టోబరు 3: చంద్రగిరి ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో మద్యం షాపులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ వాసుదేవచౌదరి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ చంద్రగిరి స్టేషన్ పరిధిలోని చంద్రగిరి, పాకాల, చిన్నగొట్టిగల్లు, ఎర్రావారిపాలెం మండలాల్లోని 17 షాపులకు నోటిఫికేషన్ జారీ చేసినట్లు పేర్కొన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు చెల్లించాలన్నారు. ఈనెల ఒకటి నుంచి 9వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. 12వ తేదీ తిరుచానూరు శిల్పారామంలో లక్కీ డ్రా జరుగుతుందని పేర్కొన్నారు.


లా కాలేజీల అనుమతులు రద్దు చేయండి



రిజిస్ట్రార్ భూపతి నాయుడుకు వినతిపత్రం ఇస్తున్న నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 3: ఎస్వీయూ పరిధిలోని లా కాలేజీలకు అక్రమంగా మంజూరు చేసిన అనుమతులను రద్దు చేయాలని టీఎన్ఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. ఇందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఎస్వీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడుకు టీఎన్ఎస్ఎఫ్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. టీఎన్ఎస్ఎఫ్ నాయకులు ఆర్కే నాయుడు, అశోక్ మాట్లాడుతూ పుత్తూరు కేఎంఆర్ లా కాలేజీ, తిరుపతిలోని రాయలసీమ లా కాలేజీకి కొత్తగా అనుమతులు ఇచ్చారని, దీని వెనుక మాజీ మంత్రి రోజా, నాటి ఉన్నత విద్యామండలి చైర్మన్ హేమచంద్రారెడ్డి అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. ఒకే భవనంలో ఇప్పటికే నాలుగు కాలేజీలు నడుస్తున్నా, అదనంగా లా కాలేజీ మంజూరు చేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ కాలేజీల వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ బార్ కౌన్సిల్, యూనివర్సిటీ, ఉన్నత విద్యామండలి అనుమతుల కోసం తప్పుడు రికార్డులు సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వీరభద్ర, రాజు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్య



మహిళ మృతదేహం

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3: రైలు కింద పడి గుర్తు తెలియని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం రేణిగుంట సమీపంలో చోటు చేసుకుంది. రైల్వే ఎస్ఐ రవి వివరాల మేరకు.. బుధవారం అర్ధరాత్రి రేణిగుంట-పూడి రైల్వే పట్టాలపై దాదాపు 35 సంవత్సరాల వయస్సు కలిగిన మహిళ రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలు ఆరంజ్ రంగు సిల్క్ చీర, ఆకుపచ్చ కలర్ జాకెట్ ధరించి ఉంది. వివరాలు తెలిసిన వారు రైల్వే ఎస్ఐ రవి 9963126343కి ఫోన్ చేసి సమాచారం అందించాలని కోరారు.

బాలాత్రిపుర సుందరిగా అమ్మవార్ల వైభవం

ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



తిరుపతి అర్బన్ : తిరుపతి లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి ఆలయంలో గురువారం శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి ఉదయం, సాయంత్రం శాస్త్రోక్తంగా పూజలు, నివేదన సమర్పించారు. తొలిరోజు అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



రామచంద్రపురం : రాయలచెరువు కట్ట జలకంఠేశ్వరాలయంలో వెలసిన భవానీదేవి గురువారం బాలాత్రిపుర సుందరిదేవిగా దర్శనమిచ్చారు. 9 ఏళ్ల బాలికకు బాలాత్రిపుర సుందరిగా పూజలు నిర్వహించారు. శ్రీశక్తి పీఠంలోని మరకతశక్తి దేవిని షోడకిదేవిగా అలంకరించారు. సాయంత్రం ఊంజల్ సేవ అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతి, శక్తి పీఠాదీశ్వరి రమ్యానందభారతి భక్తులకు అనుగ్రహభాషణం చేశారు.



భాకరాపేట : చిన్నగొట్టిగల్లు చెరుకు కట్టపై వెలసిన తిరుపతి గంగమ్మ శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

రేపు, ఎల్లుండి బస్సు పాసులు జారీకావు

తిరుపతి(ఆర్టీసీ), అక్టోబరు 3: ప్రయాణికుల సౌకర్యార్థం ఆర్టీసీ ఇచ్చే బస్సు పాసులు శని, ఆదివారాల్లో జారీ చేయడం లేదని ఏటీఎం డి.రామచంద్రనాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాసులు జారీచేసే సాంకేతికతను మరింత మెరుగుపరిచే చర్యలు చేపట్టనున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. 7వ తేదీ నుంచి యథావిధిగా జారీ చేస్తామని తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు

తిరుమల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.2.92 కోట్లు లభించింది. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ బుధవారం లెక్కించి, గురువారం ఉదయం ప్రకటించింది. ఇక, బుధవారం 80,613 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,403 మంది తలనీలాలు సమర్పించారు.

వైఖానస ఆగమాలపై శిక్షణ

తిరుపతి(కల్చరల్), అక్టోబర్ 3: దైవారాధనలో వైఖానస ఆగమ అర్చనా విధులపై తొమ్మిది రోజులు శిక్షణ ఇవ్వనున్నట్లు జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం డీన్ వీఎస్ విష్ణుభట్టాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్చన ప్రయోజనం, ఉపచారాల రకాలు, అర్చనలో వినియోగించే ద్రవ్యాలు, ఆగమాలలో వైఖానసాగమ స్వరూపం అనే వివిధ విషయాలపై సంస్కృత విశ్వవిద్యాలయం ఆన్‌లైన్ విధానంలో ఈనెల 16 నుంచి తొమ్మిది రోజులు శిక్షణ ఇస్తుందని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు పేర్ల నమోదు, వివరాల కోసం htpp://forms.gle/dbhmjwtor2h9pj1ka వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరారు.



తిరుపతిరూరల్ : తుమ్మలగుంట క్రాస్ ఎల్ఎస్ నగర్‌లోని శ్రీశక్తిచాముండేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ప్రత్యేక అభిషేకం, అలంకారం, హోమ కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి, ఉభయదారులు ఎస్.నాగమనాయుడు పాల్గొన్నారు.

దోమల లార్వాలు వృద్ధి చెందకుండా చర్యలు



అక్కారంపల్లి వద్ద కాలువను పరిశీలిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి (జీవకోన), అక్టోబరు 3: వర్షాలకు నగరంలో దోమల లార్వా వృద్ధి చెందకుండా చర్యలు చేపట్టాలని నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య అధికారులను ఆదేశించారు. గురువారం అక్కారంపల్లె, కొర్లగుంట తదితర ప్రాంతాల్లో ఆమె మురుగునీటి కాలువలను పరిశీలించి, ఆయిల్ బాల్స్ వేయించే కార్యక్రమం చేపట్టారు. వర్షాలకు నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అక్కారంపల్లె చివరలో మురుగునీరు నిలవకుండా ప్రణాళికలు సిద్ధం చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఎస్ఈ మోహన్, ఎంఈ గోమతి, డీఈ రమణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్ సుమతి, సర్వేయర్ కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు నరేష్‌రెడ్డి పాల్గొన్నారు.

చెత్త పన్ను రద్దు శుభపరిణామం

తిరుపతి (జీవకోన), అక్టోబరు 3: వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన చెత్త పన్నును సీఎం చంద్రబాబు రద్దు చేయడం శుభపరిణామమని బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ పాలనలో తీసుకున్న తొందరపాటు చర్యలు, అనాలోచిత నిర్ణయాలు ప్రజలకు శాపంగా మారాయన్నారు. తిరుపతి నగరపాలక సంస్థలో స్మార్ట్ సిటీ నిధులతో కొనుగోలు చేసిన పారిశుధ్య వాహనాలు తుప్పు పట్టిపోతున్నాయని, వీటిపై కమిషనర్ దృష్టి సారించాలని కోరారు. వర్షాలకు నగరంలోని పలు రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చాలన్నారు.



సూడో ఆధ్యాత్మికవాది పవన్ : టీటీడీ మాజీ చైర్మన్ కరుణాకర రెడ్డి

తిరుపతి(జీవకోన), అక్టోబరు 3 : కల్లు తాగిన కోతిలా మాట్లాడుతున్న పవన్ కల్యాణ్ ఓ సూడో ఆధ్యాత్మికవాది అని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి విమర్శించారు. గురువారం రాత్రి తిరుపతిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ సనాతన ధర్మం గురించి ఓనమాలైనా రాని పవన్ ఆ ముసుగు వేసుకుని పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాడని ఆరోపించారు. గత 14ఏళ్లుగా ఎప్పుడూ తన కుమార్తెలను దర్శనానికి తీసుకురాని వ్యక్తి సనాతన ధర్మం గురించి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సభలో రాజకీయాలు ప్రస్తావించనని చెప్పి జగన్‌నే టార్గెట్ చేస్తూ ఎలా మాట్లాడతాడంటూ ప్రశ్నించారు. పవన్ ప్రతి ప్రశ్నకూ సమాధానం చెప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు. అయోధ్యకు పంపిన లడ్డూల్లో కూడా కల్తీ జరిగిందని పవన్ ప్రమాణం చేయగలడా అంటూ ప్రశ్నించారు. కాషాయం ముసుగు వేసుకుని చంద్రబాబు చంకలో బిడ్డలా మాట్లాడుతున్న పవన్ స్వామి తన దివ్యశక్తితో ధర్మారెడ్డి ఎక్కడ ఉన్నారో కనుక్కోవాలంటూ వ్యంగోక్తులు విసిరారు.

సనాతన బోర్డు డిక్లరేషన్‌ను స్వాగతిస్తున్నాం

తిరుపతిరూరల్, అక్టోబరు 3 : డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ప్రకటించిన సనాతన బోర్డు డిక్లరేషన్స్‌ను స్వాగతిస్తున్నామని హిందూ ఉపాధ్యాయ సమితి జాతీయ అధ్యక్షుడు మహేష్‌డేగల పేర్కొన్నారు. డిక్లరేషన్‌లో పొందుపరచిన అంశాలతోపాటు విద్యా వ్యవస్థల్లో జరుగుతున్న హిందూ వ్యతిరేక కార్యక్రమాలను కూడా అందులో చేర్చాలని కోరారు. గత ప్రభుత్వంలో నరక చతుర్దశికి ఉన్న సెలవును రద్దు చేశారని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు.

ఎస్వీఐసీసీఏఆర్ ఎండీగా డాక్టర్ ప్రశాంత్



తిరుపతి(వైద్యం), అక్టోబరు : స్థానిక జూపార్కు రోడ్డులోని టాటా క్యాన్సర్ ఫౌండేషన్ వారి ఎస్వీఐసీసీఏఆర్(శ్రీ వెంకటేశ్వర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాన్సర్ కేర్ అండ్ అడ్వాన్స్ రీసెర్చ్) ఆస్పత్రి మెడికల్ డైరెక్టర్‌గా డాక్టర్ ప్రశాంత్ పెనుమాడును నియమించారు. ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. క్యాన్సర్‌ను మొదట్లో గుర్తించడంతో పాటు భవిష్యత్తులో నిర్మూలన దిశగా ఫౌండేషన్ కృషి చేస్తోందని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), అక్టోబరు 3: ఎస్వీయూ జియాలజీ పరిశోధకులు ఓ.విజయకుమారి డాక్టరేట్ పొందారు. ఇంటిగ్రేటెడ్ హైడ్రో జియాలజికల్ అండ్ జియోఫిజికల్ స్టడీస్ ఆఫ్ పెద్దవంక వాటర్‌షెడ్ ఏరియా, గద్వాల డిస్ట్రిక్ట్, తెలంగాణ స్టేట్ అంశంపై ప్రొఫెసర్ టి.మధు పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారని సీతఈ దామ్లానాయక్ తెలిపారు.

తిరుపతి వాసికి థాయ్‌లాండ్ ఆహ్వానం


తిరుపతి అర్బన్, అక్టోబరు 3: దసరా కల్చరల్ ఫెస్టివల్ ఇన్ థాయ్‌లాండ్‌కు తిరుపతి వాసైన డాక్టర్ కడివేటి మునిరత్నంకు ఆహ్వానం అందింది. ఆయన గురువారం ఉదయం పయనమయ్యారు. బ్యాంకాక్‌లో ఈ నెల 4నుంచి 8వ తేదీ వరకు జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. గతంలో దుబాయ్, మలేసియా వంటి దేశాల్లో జరిగిన సంగీత సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రదర్శనలు ఇచ్చారు.

జిల్లా సర్వే అధికారిగా అరుణ్‌కుమార్




తిరుపతి(కలెక్టరేట్), అక్టోబరు 3 : జిల్లా సర్వే, భూ రికార్డుల శాఖాధికారిగా డి.అరుణ్ కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న జయరాజ్ నంద్యాలకు బదిలీ అయ్యారు. కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అరుణ్ కుమార్ ఖరగ్‌పూర్ ఐఐటీలో ఇంజనీరింగ్ పూర్తి చేశారు.












తిరుమల దేవదేవుడి వైభవం ఈనాటిది కాదు. ఈ వైభవ చరిత్ర అంతా శాసనలిఖితమై ఉంది. తిరుమల, తిరుపతి, తిరుచానూరు, శ్రీనివాసమంగాపురంలలో 1,252 శాసనాలు లభించాయి. వీటిలో 800 తిరుమలలోనే లభించాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ప్రస్తావనలున్న శాసనాలే 70 ఉండడం విశేషం. పల్లవులు, చోళులు, యాదవరాయరాజులు, విజయనగర చక్రవర్తులు పలు సందర్భాల్లో వేయించిన శాసనాలు ఇవి. ఆ తర్వాత ఆర్కాటు నవాబులు, ఈస్టిండియా కంపెనీ ప్రతినిధులు, బ్రిటీష్ అధికారులు, మహంతుల కాలంలోనూ బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించేవారు. ఆయాకాలాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని ఈ శాసనాలు వెల్లడిస్తాయి. 1922-27 నడుమ సాధు సుబ్రమణ్యశాస్త్రి శాసనాలను పరిశీలించి పరిష్కరించి ఈ వివరాలు వెలుగులోకి తెచ్చారు. - తిరుమల, ఆంధ్రజ్యోతి



క్రీ.శ 966లో పల్లవరాణి సామవై వేయించిన శాసనం

బ్రహ్మోత్సవ వైభవాన్ని తెలిపే శాసనాలు



తిరుమలలో లభించిన శాసనాలు

శాసనాలను పరిశీలిస్తే..

- పల్లవరాణి సామవై క్రీ.శ 966లో శ్రీవారికి ఒక వెండి ఉత్సవమూర్తిని చేయించినట్లు ఒక శాసనం ఉంది. బ్రహ్మోత్సవాల సమయంలో ఊరేగించేందుకు ఈ ఉత్సవ మూర్తిని చేయించారు. ఈ శాసనాన్ని బట్టీ అప్పట్లో పెరటాశి మాసంలో, చిత్తా నక్షత్రంలో ఈ ఉత్సవాలు మొదలై అంకురార్పణతో కలిపి పదిరోజుల పాటు జరిగేవని తెలుస్తోంది.
- క్రీ.శ 1254లో చైత్రమాసంలో తెలుగు పల్లవరాజు విజయగండ గోపాలదేవుడు ఉత్సవాలు నిర్వహించారు.
- క్రీ.శ 1328లో ఆషాడమాసంలో 'ఆడితిరునాళ్ల' పేరుతో త్రిభువన చక్రవర్తి తిరు వేంకటనాథయాదవ రాయులు ఉత్సవాలు నిర్వహించారు.
- క్రీ.శ 1429 ఆశ్వయుజ మాసంలో వీరప్రతాపదేవరాయులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు.
- క్రీ.శ 1446లో 'మాసి తిరునాళ్ల' పేరుతో హరిహరరాయులు ఉత్సవాలు నిర్వహించారు.
- క్రీ.శ 1530లో అచ్యుత రాయులు 'అచ్యుతరాయ బ్రహ్మోత్సవం' పేరుతో ఉత్సవాలు నిర్వహించారు.

విజయనగర రాజవంశాలు	కాలం	శాసనాలు
1. సంగమ వంశీయులు	(క్రీ.శ 1336-1444)	59
2. సాళువ వంశీయులు	(క్రీ.శ 1445-1504)	168
3. తుళవ వంశీయులు		
అ) శ్రీకృష్ణదేవరాయలు	(క్రీ.శ 1509-1530)	229
ఆ) అచ్యుతదేవరాయలు	(క్రీ.శ 1530-1541)	251
ఇ) సదాశివరాయలు	(క్రీ.శ 1541-1570)	176
4. అరవీటి వంశస్తులు	(క్రీ.శ 1570-1678)	192
	మొత్తం శాసనాలు	1075

విజయనగర రాజులవే అత్యధికం

తిరుమలలో అత్యధిక శాసనాలు వేసినవారు విజయనగర వంశస్థులు. లభ్యమైనవాటిలో 1075 శాసనాలు వీరివే. వీరికి పూర్వపు రాజులైన పల్లవులు, చోళులు, పాండ్యులు, యాదవులు, ఇతర రాజోద్యోగులు వేయించిన శాసనాలు 177 మాత్రమే. విజయనగర రాజులకు శ్రీవారి ఆలయంతో ఉన్న అనుబంధాన్ని శాసనాల సంఖ్య తెలియజేస్తుంది. శ్రీకృష్ణ దేవరాయలే ఏడు సార్లు తిరుమలను సందర్శించారంటే స్వామి మీద వారికున్న అపారమైన భక్తి విశ్వాసాలు ఎంతటివో వెల్లడవుతోంది. ఆలయ నిర్వహణ కోసం మణులు, మాన్యాలు ఇచ్చిన వివరాలను ఈ శాసనాల్లో నమోదు చేశారు. విజయనగర రాజులు వేసిన శాసనాల్లో ఎక్కువగా తెలుగు, తమిళ, కన్నడ భాషల్లోనూ, కొన్ని సంస్కృతంలోనూ ఉన్నాయి.

బ్రహ్మోత్సవాల కోసం దానాలు

శ్రీవారి బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం గ్రామాలను, భూములను, ధనాన్ని దానంగా ఇచ్చినట్లు పలు శాసనాల్లో లిఖితమై ఉంది. తిరుమల బ్రహ్మోత్సవాలు వైభవంగా జరగడానికి ఈ దానాలు తోడ్పడ్డాయి. ఈ దానాల నుంచీ లభించే ఆదాయంతో ఉత్సవాల సమయంలో వాహనాల అలంకరణ, దూపదీపనైవేద్యాలు వంటివి చేసేవారు.

- బ్రహ్మోత్సవాల నిర్వహణ కోసం రాజులు నాణాలు సమర్పించేవారు. వాటిలో కళంజు, చక్రపొన్, రేఖైపొన్, వరహాలు, గట్టివరహాలు, పొన్, మూడ, పణం, నార్పణం వంటివి ఉన్నాయి.
- క్రీ.శ 1388లో విజయనగర రెండో హరిహరరాయులు పూంగోడు గ్రామ ఆదాయంతో బ్రహ్మోత్సవాలను నిర్వహించే ఏర్పాటు చేశారు. ఈయనే తిరిగి క్రీ.శ 1429లో బ్రహ్మోత్సవ నిర్వహణ కోసం మూడు గ్రామాలతో పాటు 2,200 బంగారు నాణేలను సమర్పించారు.
- క్రీ.శ 1551లో రాయసం వెంకటాద్రి పది బ్రహ్మోత్సవాలకు నైవేద్య సమర్పణకు ఏర్పాట్లు చేశారు.
- తాళ్లపాక పెద్దతిరుమలయ్య క్రీ.శ 1561లో 2వేల వరహాలు సమర్పించి ఆణి బ్రహ్మోత్సవాన్ని ప్రారంభించి 13 రోజుల పాటు నిర్వహించారు.

డిగ్రీ కళాశాల ఏర్పాటుపై పరిశీలన



వరదయ్యపాళెంలో పరిశీలకుల బృందం

వరదయ్య పాళెం, అక్టోబరు 3: వరదయ్యపాళెం జూనియర్ కళాశాలలో డిగ్రీ కళాశాల ఏర్పాటుపై అధికారులు పరిశీలిం చారు. వరదయ్య పాళెంలో డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని టీడీపీ కార్యకర్త మున గాల వెంకయ్య ఆగస్టులో సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. దీనిపై సీఎం కార్యాలయం స్పందించి పరిశీలించి నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. దీంతో కళాశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు డాక్టర్ బాబు, శ్రీకాళహస్తి పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వైస్‌ప్రిన్సిపాల్ నరసింహవర్మ వరదయ్యపాళెం జూనియర్ కళాశాలను గురువారం పరిశీలించారు. ప్రిన్సిపాల్ పద్మావతి వారికి కళాశాలలోని మౌలిక సదుపాయాలను వివరించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని పరిశీలకులు తెలియజేశారు. టీడీపీ మండలాధ్యక్షుడు యుగంధర్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరసరాజు, జనసేన నాయకులు జానకిరామ్, శ్రీను, రామయ్య, బీజేపీ నాయకులు త్యాగరాజు, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

చేతి బోరు, పైపులైను ఏర్పాటు



బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3: మండలంలోని కారణి మిట్ట గ్రామంలో తాగునీటి కోసం చేతి బోరు, పైపులైను పనులు గురువారం చేపట్టినట్లు సర్పంచ్ పద్మమ్మ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మూడు వీధుల ప్రజలు తాగునీటి కొరతతో ఇబ్బందులు పడుతుండటంతో జిల్లా పరిషత్ నిధులు రూ.2లక్షలతో చేతి బోరు వేయించి పైపులైను ద్వారా నీటిని అందిస్తామన్నారు.

ఆరుతడి పంటలపై అవగాహన

వరదయ్యపాళెం, అక్టోబరు 3: మండలంలోని అంబూరు, మరదవాడ గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆరుతడి పంటల సాగుపై అధికారులు వివరించారు. సూక్ష్మ నీటి పారుదల గురించి ఉద్యాన అధికారి రాధారాణి వివరించారు. రైతులు తమకు స్ప్రేయర్లు, నాగళ్లు అందించాలని రైతులు కోరారు. వ్యవసాయాధికారి ద్వారకనాథ్, విస్తరణ అధికారి ప్రవీణ్, వ్యవసాయ సహాయకులు పద్మ, పశుసంవర్థక శాఖ సహాయకులు కిసక్కర్, సర్పంచులు, రైతులు పాల్గొన్నారు.

తొలిరోజు బాలా త్రిపురసుందరిగా దర్శనం

వరదయ్యపాళెం, అక్టోబరు 3: నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వరదయ్యపాళెంలో వెలసిన చెంగాలమ్మ పరమేశ్వరి అమ్మవారు గురువారం బాలా త్రిపురసుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. నిర్వాహకులు బొప్పన మోహనమురళి, శాంతమ్మ, చెంగల్రాయులు, మోహన్‌రావు పాల్గొన్నారు.

నారాయణవనం: మండలంలోని కైలాసనాథకోనలో వెలసిన కామాక్షమ్మ సమేత కైలాసనాథస్వామి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో కృష్ణనాయక్, మాజీ చైర్మన్ బత్తల భాస్కర్‌యాదవ్, అర్చకులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: అంబూరులోజూట కామాక్షమ్మ బాలాత్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు. ధర్మకర్త సాయిరెడ్డి, ప్రసన్న కుమార్‌రెడ్డి, ఆణిముత్యం నందకిషోర్‌రెడ్డి, మునిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

సత్యవేడు: పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో తొలిరోజు ఆలయంలో బాలత్రిపుర సుందరిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

తడి,పొడి చెత్తను సంపద కేంద్రాలకు చేర్చాలి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3: తడి పొడి చెత్తన సేకరించి సంపద కేంద్రంలో చేర్చాలని ఈవోపీర్డీ రాజశేఖర్ తెలిపారు. కుక్కంబాకం సర్పంచ్ డిల్లీ ఆధ్వర్యంలో సంపద కేంద్రాన్ని గురువారం ప్రారంభించారు. ప్రజలకు చెత్త బట్టలను పంపిణీ చేశారు. కార్యదర్శి నందిని పాల్గొన్నారు.

ఉపాధి పనుల కోసం గ్రామసభ

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3: మండలంలోని కంచనపుత్తూరు పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో పనులు ఎంపిక కోసం సర్పంచ్ స్వప్న ఆధ్వర్యంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. నీటి గుంతలు, చెరువులో పూడికతీత పనులు, పంట కాలువ మరమ్మతు పనులు చేపట్టాలని ప్రజలు కోరారు. కార్యదర్శి ఇందిరమ్మ మాట్లాడుతూ నివేదికలు తయారు చేసి పనులు మంజూరుకు నివేదిక పంపుతామన్నారు.

రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ



అంజూరు శ్రీనివాసులను సత్కరిస్తున్న ప్రకాష్‌నాయుడు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: ముక్కంటి ఆలయ మాజీ చైర్మన్ అంజూరు శ్రీని వాసులు జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరి గాయి. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు, పాలు పంపిణీ చేశారు. తొట్టంబేడు మండలం శివనాథపురంలోని అమ్మ ఆశ్రమంలో అన్నదానం చేశారు. వైఎస్ఆర్ కూడలి వద్ద అన్నదానం చేశారు. పార్లమెంటు తెలుగురైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, టీడీపీ నాయకులు గోగినేని సురేష్‌నాయుడు అంజూరు శ్రీనివాసులను ముక్కంటి శేషవస్త్రంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

దసరా నవరాత్రులు ప్రారంభం



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా కనకాచలంపై వెలసిన కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయంలో కలశాన్ని ప్రతిష్టించి విశేష పూజలు నిర్వహించి కర్పూర హారతులు సమర్పించారు. మంగళవాయిద్యాల నడుమ ఓంశక్తి నామస్మరణతో కలశాన్ని ఆలయ పండితులు మంత్రోచ్చరణల మధ్య ఆలయప్రాకారం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. మహిళలు పెద్దఎత్తున కనకాచలంపై దీపాలు వెలిగించారు. మొక్కులు చెల్లించు కున్నారు. కాగా ఈవో చంద్రశేఖర్ ఆజాద్ మాట్లాడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశామన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు సర్వంసిద్ధం

- నేటి నుంచి మొదలుకానున్న వాహనసేవలు
- పుష్ప, విద్యుత్ అలంకరణతో ముస్తాబైన కొండ



తిరుమల, అక్టోబరు 3 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. భక్తుల రద్దీకి తగినవిధంగా టీటీడీ అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. గురువారం నుంచే తిరుమలలో బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. తొలిరోజైన శుక్రవారం సాయంత్రం 5.45 నుంచి 6 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. ప్రతిరోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు వివిధ వాహన సేవలు జరుగుతాయి. గరుడ వాహన సేవ మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.

ప్రత్యేక దర్శనాలన్నీ రద్దు

పెరటాశి మాసం (తిరుమల శనివారాలు), బ్రహ్మోత్సవాలు ఒకేసారి జరగనున్న నేపథ్యంలో రద్దీ అధికంగా ఉంటుందని టీటీడీ అంచనా వేసింది. దీంతో సిఫార్సు వీఐపీ బ్రేక్, వృద్ధులు, దివ్యాంగులు, చంటిబిడ్డల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, రక్షణ సిబ్బందికి, ఇతర ట్రస్టు దాతలకు కల్పించే ప్రత్యేక దర్శనాలన్నీటిని రద్దు చేసింది. బ్రహ్మోత్సవాల్లో సర్వదర్శనం, రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనాలు మాత్రమే ఉంటాయి. స్వయంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే వీఐపీ బ్రేక్ దర్శనం ఉంటుంది. గరుడసేవరోజు ప్రొటోకాల్ దర్శనాలనూ రద్దు చేశారు.

ఆకట్టుకుంటున్న విద్యుత్, పుష్పాలంకరణలు

జీఎన్సీ టోల్‌గేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, వైకుంఠం క్యూకాంప్లెక్స్, మాడవీధులు, అన్నప్రసాదభవనం, ఆస్థానమండపం, రాంభగీచ, లడ్డూ కౌంటర్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు రోడ్లుకు ఇరువైపులా, పార్కులు, వాటర్‌ఫౌంటెన్లు, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ, పార్కాన్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు. ఇక, 6 టన్నుల పుష్పాలతో ఆలయం వెలుపల, 4 టన్నులు ఆలయంలోపల అలంకరణకు వినియోగించారు. 60 వేల కట్‌ఫ్లవర్స్‌నూ ఆలయంలో అలంకరణకు వాడారు.

కల్యాణ వేదికలో 'సీతా స్వయంవరం'

ఎప్పటిలాగే కల్యాణవేదిక వద్ద పలు రకాలు పుష్పమొక్కలు, పండ్లు, కూరగాయలతో పక్షులు, జంతువులతో ప్రదర్శనాల సిద్ధమైంది. ఈఏడాది 'మిథిలానగరంలో సీతా స్వయంవరం' సెట్టింగ్ వేశారు. 'అయోధ్య రామ' సైకతా శిల్పాన్ని సిద్ధం చేస్తున్నారు. వివిధ పురాణ ఘట్టాలకు సంబంధించి బొమ్మలను ఏర్పాటు చేశారు. శుక్రవారం నుంచి ఈ ప్రదర్శనశాల భక్తులకు అందుబాటులోకి రానుంది.

పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

ధ్వజారోహణం సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు రాష్ట్ర ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికి గాను ఆయన శుక్రవారం రాత్రి తిరుమల చేరుకుంటారు. బేడిఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణం వద్ద అర్చకులు పరివట్టంచుట్టగా.. తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. అక్కడ్నుంచి మంగళ వాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. ఆ సమయంలో జీయ్యంగార్లు శేషవస్త్రాన్ని మెడలో ధరింపచేస్తారు. రంగనాయకుల మండపంలో వేదపండితుల ఆశీర్వచనం తర్వాత టీటీడీ 2025 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. అనంతరం వాహనం మండపం వద్దకు చేరుకుని పెద్దశేషవాహన సేవలో పాల్గొంటారు. ఆ తర్వాత పద్మావతి విశ్రాంతి భవనంలో బస చేసి.. శనివారం ఉదయం వకుళమాత సెంట్రల్ కిచెన్ ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు.

పెరిగిన రద్దీ

గురువారం మధ్యాహ్నం నుంచి తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగింది. నడకమార్గాల్లో, వాహనాల్లో భారీగా తిరుమలకు చేరుకుంటున్నారు. దీంతో శ్రీవారి ఆలయం మొదలుకొని మాడవీధులు, బస్టాండ్, లడ్డూకౌంటర్, అన్నప్రసాద కాంప్లెక్స్, వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లు, కల్యాణకట్టలు, గదుల కేటాయింపు కేంద్రాలు భక్తులతో రద్దీగా మారాయి.

ముగిసిన పవన్ తిరుమల పర్యటన



తిరుపతిలోని వారాహి సభలో పవన్ కల్యాణ్‌కు రాజదండం బహూకరించిన ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు కుమారులు మదన్, జగన్

తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): జనసేనాని, డిప్యూటీసీఎం పవన్‌కల్యాణ్ మూడు రోజుల తిరుమల పర్యటన ప్రశాంతంగా ముగిసింది. మంగళవారం రాత్రి కాలినడన తిరుమల చేరుకున్న ఆయన.. బుధవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో తన ఇద్దరి కుమార్తెలతో శ్రీవారిని దర్శించుకున్నారు. బుధవారం మధ్యాహ్నం నుంచి గురువారం సాయంత్రం వరకు గదిలోనే ఉన్నారు. సాయంత్రం 5.15 గంటలకు ఆయన తిరుమల నుంచి తిరుపతికి తిరుగు ప్రయాణమయ్యారు. అప్పటికే అతిథిగృహం ముందు వేచిఉన్న అభిమానులకు నమస్కరిస్తూ వాహనం ఎక్కారు. తిరుమలకు చెందిన చిరంజీవి కాఫీ పౌడర్‌తో వేసిన పవన్ కల్యాణ్ ఫొటోను అతిథిగృహం ముందు ప్రదర్శించారు.

గతానికంటే గొప్పగా బ్రహ్మోత్సవ ఏర్పాట్లు: ఈవో



మాట్లాడుతున్న ఈవో శ్యామలరావు

తిరుమల, అక్టోబరు3(ఆంధ్రజ్యోతి): గతానికంటే గొప్పగా ఈసారి శ్రీవారి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు గొప్పగా చేశామని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. వాహన సేవలతో పాటు గర్భాలయంలోని మూలవిరాట్టు దర్శనాన్ని భక్తులకు సంతృప్తికరంగా చేయించడమే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించుకున్నామన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో గురువారం అదనపు ఈవో వెంకయ్య చౌదరి, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్లు, వాహన సేవల గురించి వివరించారు. 1,250 మంది విజిలెన్స్, 3,900 మంది పోలీసులతో బ్రహ్మోత్సవాలకు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవకు మరో 1,200 మంది పోలీసులు విధులకు హాజరవుతారన్నారు. 2,775 సీసీ కెమెరాలతో నిఘా పెట్టామన్నారు. భద్రతాపరంగా భక్తులు సమస్యలు ఎదుర్కొంటే 155257 నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చన్నారు. వాహన సేవల వీక్షణకు 28 ఎల్ఈడీ స్క్రీన్లు.. 9 వేల వాహనాలకు పార్కింగ్ ప్రదేశాలు సిద్ధం చేశామన్నారు. బ్రహ్మోత్సవ రోజుల్లో స్వయంగా వచ్చే దాతలకు మాత్రమే గదులు కేటాయిస్తామన్నారు.

మీ పరిసరాలపైనా నిఘా ఉంచండి

భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు తమ పరిసరాలపైనా నిఘా ఉంచి అప్రమత్తంగా ఉండాని డిప్యుటేషన్ సిబ్బందికి ఈవో శ్యామలరావు సూచించారు. తిరుమలలోని ఆస్థాన మండపంలో గురువారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీసు, జిల్లా అధికారయంత్రాంగంతో టీటీడీ డిప్యుటేషన్ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. అదనపు ఈవో వెంకయ్య చౌదరి, సీవీఎస్వో శ్రీధర్, జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, సీఈ సత్యనారాయణ, ఎఫ్ఏసీఏవో బాలాజీ, సీపీఆర్వో రవి తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపుల ఆన్‌లైన్ టెండర్లకు 'సర్వర్' కష్టాలు

- ఎక్సైజ్ స్టేషన్ల వద్ద దాఖలుకూ సమస్యలు
- టెండరుదారుల ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), అక్టోబరు 3: మద్యం షాపులకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లు దాఖలు చేయడానికి సర్వర్ కష్టాలు ఎదురవుతున్నాయి. సర్వర్ పని చేయకపోవడం, వెబ్‌సైట్‌లో సరైన స్పష్టత అధికారులు ఇవ్వక పోవడం, టెండరుదారులకు అవగాహన కల్పించడంలో ఎక్సైజ్ అధికారుల చొరవ చూపకపోవడంతో నానా తిప్పలు పడుతున్నారు. ఇక, జిల్లాలోని 11 ఎక్సైజ్ స్టేషన్లలో సిబ్బంది కొరత పీడిస్తోంది. ప్రతి స్టేషన్‌లో టెండర్లు దాఖలు చేసే వెసులుబాటు ప్రభుత్వం కల్పించింది. అయితే ఎక్సైజ్ స్టేషన్లలో ఆన్‌లైన్ వ్యవస్థపైన పట్టులేకపోవడం, కంప్యూటర్ ఆపరేటర్లు అందుబాటులో ఉండకపోవడంతో టెండరు దారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. తిరుపతి అర్బన్ స్టేషన్‌లో కనీసం కంప్యూటర్‌పైన పట్టు వున్న సిబ్బంది ఒక్కరూ లేకపోవడం గమనార్హం. దీంతో కౌంటర్ల వద్ద నియమించిన డిజిటల్ అసిస్టెంట్, ఎస్‌బీఐ ప్రతినిధిపైనే ఆధారపడి టెండర్లు దాఖలు చేయాల్సి ఉంది. దీంతో మూడు రోజులుగా ఆశించిన స్థాయిలో టెండర్లు దాఖలు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఈ క్రమంలో తిరుపతి, రూరల్, శ్రీకాళహస్తి స్టేషన్లలో కనీసం నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేయాలి. ఇద్దరు డిజిటల్ అసిస్టెంట్లు వుండాలి. చలానాలు కట్టించుకుని బ్యాంకులో ప్రభుత్వ ఖజానాకు టెండరు దాఖలు ఫీజు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేకుంటే గడువు లోగా టెండర్లు దాఖలు చేయలేమని టెండరుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం వరకు జిల్లా వ్యాప్తంగా కేవలం మూడు టెండర్లు మాత్రమే దాఖలైనట్లు అధికారులు ప్రకటించారు. ఇక, గురువారం నాటికి తిరుపతి అర్బన్ పరిధిలో ఆరు మద్యం దుకాణాలకు గాను 8 టెండర్లు మాత్రమే దాఖలయ్యాయని జిల్లా ఎక్సైజ్ ఈఎస్ నాగమల్లేశ్వర రెడ్డి చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడా టెండర్లు దాఖలు చేయలేదన్నారు. కాగా, టెండర్ల దాఖలులో ఎదురవుతున్న సమస్యలపై ఈఎస్‌ను వివరణ కోరగా.. డిమాండును బట్టి ఒక్కో స్టేషన్‌లో రెండు నుంచి మూడు కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రస్తుతం టెండర్లు అనుకున్న స్థాయిలో దాఖలు కాక పోవడంతో మౌలిక వసతులు కల్పించే విషయంలో ఆలోచిస్తున్నట్లు తెలిపారు. తమ సిబ్బందిలో అవగాహన ఉన్న వారిని నియమిస్తున్నట్లు చెప్పారు. టెండరుదారులలో ఎవరికైనా సందేహాలుంటే సంబంధిత సీఐలను కలసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఆగమోక్తంగా గురుదక్షిణామూర్తికి పూజలు

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన మేథో గురు దక్షిణామూర్తికి గురువారం ఆగమోక్తంగా పూజలు నిర్వహించారు. ముందుగా కలశ ప్రతిష్ట, వినాయక పూజలు చేశారు. స్వామివారికి అభిషేకం నిర్వహించి సుగంధ పూలు, స్వర్ణాభరణాలతో విశేషంగా అలంకరించారు. పలు మంగళ హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు.

పుత్తూరు వార్తలు

11న మద్యం దుకాణాల కేటాయింపు : సీఐ



ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్

పుత్తూరు అర్బన్, అక్టోబరు3: ఈ నెల 11వ తేదీన తిరుపతి శిల్పారామం(అర్బన్ హాట్) కేంద్రంగా లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుందని పుత్తూరు ఎక్సైజ్ సీఐ మురళీ మోహన్ పేర్కొన్నారు. గురువారం స్థానిక కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పుత్తూరు టౌన్ పరిధిలో రూ.65 లక్షలు, నారాయణవనం, వడమాలపేట, రామచంద్రాపురం మండలాల్లో ఏడాదికి రూ.55 లక్షల అద్దెను నిర్దేశించినట్లు తెలిపారు. పుత్తూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 18 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు వివరించారు. పుత్తూరు టౌన్‌లో -7, నారాయణవనం మండలం -4, వడమాలపేట మండలం -4, రామచంద్రాపురం మండలం -3 దుకాణాలు ఉన్నాయని వివరించారు.

మద్యం బాటిళ్లు సీజ్.. ఒకరి అరెస్టు

పుత్తూరు అర్బన్, అక్టోబరు3: గాంధీ జయంతి రోజైన బుధవారం రాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో మద్యం విక్రయిస్తున్న మునస్వామి అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 31 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు. ఎస్ఐ అంజాద్‌బాష, హెడ్ కానిస్టేబుల్ బాలు, కానిస్టేబుళ్లు మధు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితురాలికి రూ.10 వేల ఆర్థికసాయం



పుత్తూరు అర్బన్, అక్టోబరు3: పుత్తూరు మున్సిపల్ పరిధిలోని నంది మంగళంలో కాలేయ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఐదేళ్ల మోక్షితకు వైద్య ఖర్చుల నిమిత్తం టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పోతుగుంట విజయ్‌బాబు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. గురువారం ఎంబీ రోడ్డులోని తన కార్యాలయంలో నగదును బాధితురాలు తల్లి ప్రియకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరమేశ్వర మంగళం ఎంపీటీసీ శ్రీజ, టీడీపీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి రవినాయుడు, రాష్ట్ర ఎస్సీ సెల్ కార్య నిర్వాహక కార్యదర్శి ధనపాల్, నాయకులు మధుసూదన్ రాజు, చంద్రయాదవ్, అరవ ప్రకాష్, రాజేష్ పాల్గొన్నారు.

ఆదిపరాశక్తి అలంకరణలో ద్రౌపది అమ్మవారు

పుత్తూరు టౌన్, అక్టోబరు 3: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం పుత్తూరులోని ద్రౌపదిదేవి సమేత ధర్మరాజులస్వామి ఆలయంలో అమ్మవారిని ఆదిపరాశక్తిగా అలంకరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా పట్టణానికి చెందిన నాగరత్నమ్మ, బాలసుబ్రమణ్యం దంపతులు వ్యవహరించారు. ఈ కార్య క్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ క్రిష్ణప్ప మెదలి, సభ్యులు మునిచంద్ర, దామోదరం, పురోహితులు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం



బాలా త్రిపుర సుందరి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

వడమాలపేట, అక్టోబరు 3: స్థానిక కన్యాకపరమేశ్వరి అమ్మవారి ఆలయంలో గురువారం నవరాత్రి ఉత్సవాలను వైభవంగా ప్రారంభించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. పురోహితులు ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. వేదమంత్రాలతో కలశ స్థాపన చేశారు. మహిళలు లలితా సహస్రనామార్చన, కుంకుమ పూజలు చేశారు రాత్రి అమ్మవారిని బాల త్రిపుర సుందరి దేవి రూపంలో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. స్థానిక అంకాల పరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి వెండి కవచాన్ని తొడిగి పూజలు చేశారు.

గుర్తుతెలియని మహిళ మృతి

వడమాలపేట, అక్టోబరు3: పూడి -రేణిగుంట రైల్వే మార్గంలో గుర్తుతెలియని మహిళా రైలు కిందపడి మృతి చెందినట్లు రేణిగుంట రైల్వే ఎస్ఐ రవి తెలియజేశారు. మృతురాలి వయసు సుమారు 35 సంవత్సరాల ఉంటుందని వివరించారు. ఆకుపచ్చ, ఆరెంజ్ రంగు సిల్క్ చీర ధరించి ఉందని వివరించారు.

ఫ్రీ హోల్డ్ భూముల రికార్డుల పునఃపరిశీలనలో వేగం

- 10వ తేదీకి నివేదికలు అందించేందుకు సన్నద్ధం
- పుత్తూరు మండలంలో 727 ఎకరాల భూమి



రికార్డులు పరిశీలిస్తున్న తహశీల్దార్ వెంకటేశ్వర్లు

పుత్తూరు అర్బన్, అక్టోబరు3: ఈ నెల 10వ తేదీ లోపు ఫ్రీ హోల్డ్ భూముల వివరాలపై కలెక్టర్‌కు నివేదికలు పంపేందుకు పుత్తూరు రెవెన్యూ అధికారులు వేగం పెంచారు. గత ప్రభుత్వ హయాంలో నిషేధిత జాబితా నుంచి తొలగించిన ఫ్రీ హోల్డ్ భూముల విషయమై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ ఫ్రీ హోల్డ్ భూముల విషయంలో అవకతవకలు జరిగాయని గుర్తించిన కూటమి ప్రభుత్వం రిజిస్ట్రేషన్‌లను నిలిపివేస్తే ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఫ్రీ హోల్డ్ చేసిన భూమలకు సంబంధించి ప్రతి సర్వే నెంబర్‌ను పరిశీలించాలని జిల్లా అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో అసైన్ చేసి 20 ఏళ్లు దాటిన భూములను నిషేధిత జాబితా నుంచి తొలగిస్తూ పుత్తూరు మండలంలో 12 గ్రామాలలో కేటాయించిన 727 ఎకరాల భూ రికార్డుల పరిశీలన సాగుతోంది. చెర్లోపల్లిలో 7 ఎకరాలు, నందిమంగళంలో 27 ఎకరాలు, నేసునూరులో 32, తిరుమల కుప్పంలో 112, తొరూర్‌లో 25, ఈశ్వరపురంలో 138 , తడుకులో 57, పుత్తూరులో 14, కళింకుప్పంలో 55 , కేబీఆర్ పురంలో 257, ఉత్తర కండ్రిగ, వేపగుంటలో 1.54 ఎకరాల భూమిని 607 మంది లబ్ధిదారులకు ఫ్రీ హోల్డ్ కింద కేటాయించారు. ఈ రికార్డులను పరిశీలిస్తున్న తహశీల్దార్‌కు, ఇతర సిబ్బందికి దిమ్మతిరిగేలా వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. అడంగల్, 1-బి రికార్డుల్లో నమోదు లేకుండానే ఫ్రీ హోల్డ్ కేటాయింపులు జరిగినట్లు గుర్తిస్తున్నారు. అందుకు అనుగుణంగా ప్రతి రికార్డును క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. నిబంధనలు అతిక్రమించిన అధికారులపై వేటు పడే అవకాశం లేకపోలేదు.

ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు సాదర వీడ్కోలు



రేణిగుంట, అక్టోబరు 3: ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తిరుమల, తిరుపతి మూడు రోజుల పర్యటనను ముగించు కుని గురువారం రాత్రి 8.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుని విజయవాడకు బయలుదేరారు. ఆయనకు తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నాయకులు తదితరులు సాదర వీడ్కోలు పలికారు.


మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన రెడ్డివారి గురవారెడ్డి

ఏర్పేడు, అక్టోబరు 3: మంత్రి నారా లోకేశ్‌ను టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గంలోని పలు రాజకీయ విషయాలను తెలిపారు. మంత్రికి గురవారెడ్డి ముక్కంటి తీర్థప్రసాదాలను అందజేశారు.

పరిసరాల శుభ్రతతోనే మంచి ఆరోగ్యం

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని ఎస్వీయూ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా గురువారం మారథాన్‌ను ఆర్‌జేడీబాబు ప్రారంభించారు. అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

బాలా త్రిపుర సుందరిగా పార్వతీదేవి



ఏర్పేడు, అక్టోబరు 3: ఏర్పేడు మండలంలో దేవీ నవరాత్రులు వైభవంగా గురువారం ప్రారంభ మయ్యాయి. అందులో భాగంగా పాపానాయుడు పేటలో వెలసిన పార్వతీదేవి బాలాత్రిపుర సుం దరిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఇక చిందేపల్లి గ్రామంలో వెలసిన పార్వతీ సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో గణ పతిపూజతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమంలో గంగలపూడి మోహన్‌రెడ్డి, గ్రామపెద్దలు మహానందరెడ్డి, బాలగురునాథం, సుబ్రహ్మణ్యంరెడ్డి పాల్గొన్నారు. ఎండీపుత్తూరులో వెలిసిన ఎల్లమ్మతల్లి శైలపుత్రిగా భక్తులకు దర్శనమిచ్చారు.

కట్టపుట్టాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

రేణిగుంట, అక్టోబరు 3: దసరా మహోత్సవంలో భాగంగా రేణిగుంట-కడప మార్గంలోని కరకంబాడి వద్ద వెలసిన కట్టపుట్టాలమ్మ ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటిరోజు అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేపట్టి విశేష పూజలు చేశారు. ఈ నెల 12వ తేదీ వరకు ఒక్కో అలంకరణలో భక్తులకు అమ్మవారు దర్శనభాగ్యం కల్పించ నున్నారు. ఆలయ కమిటీ భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేసింది.

సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన భద్రత



అధికారులకు సూచనలు ఇస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

రేణిగుంట, అక్టోబరు 3: తిరుమల శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల సందర్భంగా వెంకటేశ్వరస్వామివారికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించేందుకు శుక్రవారం సాయంత్రం సీఎం చంద్రబాబు విచ్చేయ నున్నారు. తిరుపతి విమానాశ్రయం నుంచి రోడ్డు మార్గం ద్వారా తిరుమల చేరుకోనున్నారు. ఈ నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టింది. ఎస్పీ సుబ్బరాయుడు ఆధ్వర్యంలో గురువారం విమానాశ్రయం నుంచి తిరుమల శ్రీవారి ఆలయం వరకు కాన్వాయ్ రిహార్సల్స్ నిర్వహించారు. అంతకుముందు అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగభూషణరావు, డీఎస్పీలు, సీఐలు, ఆర్ఐలు, ఇం టెలిజెన్స్ అధికారులు పాల్గొన్నారు.

శ్మశాన స్థలం ఆక్రమణపై ఫిర్యాదు



శ్మశానస్థలంలో ఏర్పాటు చేస్తున్న పైపులైను

కేవీబీపురం, అక్టోబరు 3: మండలంలోని వగత్తూరు దళితులకు కేటాయించిన శ్మశాన స్థలం ఆక్రమించారంటూ రెవెన్యూ అధికారులకు గ్రామస్తులు గురువారం ఫిర్యాదు చేశారు. సర్వే నెంబరు 74/2లో 63 సెంట్లు శ్మశానానికి ప్రభుత్వం కేటాయించింది. గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే రైతుకు సర్వే నెంబరు 74/1లో 4.30 ఎకరాల భూమి ఉంది. అందులో 53 సెంట్ల స్థలాన్ని గ్రామం ఏర్పడినప్పుడు శ్మశానానికి దానంగా ఇచ్చారు. దీనికి సంబంధించి ఎటువంటి రాతలూ లేవు. ఈ క్రమంలో సర్వేనెంబరు 74/2లో 63 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని ప్రభుత్వం శ్మశానికి కేటాయించింది. ఈస్థలాలు రెండు పక్కపక్కనే ఆనుకుని ఉన్నాయి. ఆ స్థలాల్లో అంత్యక్రియలు నిర్వహించుకునేవారు. ఈ క్రమంలో సుబ్రహ్మణ్యం తన భూమిని శ్రీనివాసులు అనే వ్యక్తికి విక్రయించాడు. శ్మశానానికి దానంగా ఇచ్చిన 53 సెంట్లు కూడా అందులో ఉంది. ఆ భూమిని కూడా శ్రీనివాసులు ఎక్స్‌కవేటర్‌తో చదును చేయించి పైపులైను ఏర్పాటు చేశాడు. గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే అతడు ఘర్షణకు దిగడంతో గ్రామస్తులు, దళితులు రెవెన్యూ వారిని ఆశ్రయిం చారు. న్యాయం చేయాలని కోరారు.

సేంద్రియ వ్యవసాయంపై దృష్టి సారించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, అక్టోబరు 3: సేంద్రియ వ్యసాయంపై రైతులు దృష్టి సారించాలని ఏవో భారతి తెలిపారు. బీఎన్‌కండ్రిగ పంచాయతీలో 'పొలం పిలుస్తోంది 'కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రసాయనాల ఎరువులను వీలైనంత వరకు తగ్గించాలన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్ నాయుడు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

బయోమెట్రిక్ ద్వారా గదుల కేటాయింపు

శ్రీకాళహస్తి, అక్టోబరు3: శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో గదులను ఇకనుంచి బయోమెట్రిక్ ద్వారా కేటాయించనున్నట్లు ఈవో చంద్ర శేఖర్ ఆజాద్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆధార్ కార్డు, ఏదైనా ఇతర గుర్తింపు కార్డులతో గదులను సీఆర్వో కార్యాలయం వద్ద, వసతి సముదాయంలో కానీ బుక్ చేసుకోవచ్చని వివరించారు.

రియాజ్‌కు ఉత్తమ రక్తదాన పురస్కారం



వరదయ్యపాళెం, అక్టోబరు 3:ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని గురువారం నెల్లూరులోని రెడ్‌క్రాస్ బ్లడ్‌బ్యాంకులో చైర్మన్, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి చేతుల మీదుగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇందులో వరదయ్యపాళెంకు చెందిన రియాజ్‌కు ఉత్తమ రక్తదాన పురస్కారం లభించింది. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ తాను పలుమార్లు ఈ సంస్థ తరపున రక్తదానం చేసినందుకు ఈ అవార్డు వచ్చిందన్నారు.

మద్యం విక్రయం.. ఇద్దరి అరెస్టు



నాగలాపురం, అక్టోబరు 3: గాంధీ జయంతి రోజున మద్యం విక్రయించిన ఇద్దరిపై నాగలాపురం పోలీసులు కేసునమోదు చేశారు. మండలంలోని నందనం గ్రామంలో బుధవారం రాత్రి నాగలాపురం ఎస్ఐ సునీల్‌కుమార్ పలు దుకాణాలపై దాడులు చేశారు. గ్రామానికి చెందిన చిరు వ్యాపారులు గురవయ్య, వెంకటేష్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా అరెస్టుచేశారు. వారి నుంచి పలు మద్యం బాటిళ్లను స్వాధీ నం చేసుకున్నారు. నిందితులను గురువారం సత్యవేడు కోర్టుకు తరలించారు. ఈ దాడుల్లో హెడ్ కానిస్టేబుళ్లు ఇమ్మానువేల్, కానిస్టేబుల్ భూపతి, హోమ్‌గార్డు ప్రసాద్ పాల్గొన్నారు.

శరన్నవ రాత్రులకు అంకురార్పణ

నారాయణవనం, అక్టోబరు 3: మండలంలోని సముదాయం టీటీడీ అనుబంధ అవనాక్షమ్మ ఆలయ శరవన్నరాత్రి ఉత్సవాలకు గురువారం కలశ స్థాపన చేసి, గణపతి, నవగ్రహ పూజలు చేసి అంకురార్పణ నిర్వహించారు. శుక్రవారం ఉదయం ధ్వజారోహణంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని ఆలయ అధికారి నాగరాజు, అర్చకులు పన్నీర్‌సెల్వం పేర్కొన్నారు.

శరణం తల్లీ.. శైలపుత్రీ

- శ్రీకాళహస్తిలో దసరా ఉత్సవాలు ప్రారంభం
- పలు అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవార్లు



శివపూజ అలంకారంలో బజారువీధిలోని కన్యకాపరమేశ్వరి, బాలత్రిపురసుందరిగా భాస్కరపేట చాముండేశ్వరి, బహదూరుపేటలో కన్యకాపరమేశ్వరికి బాల వాసవిదేవి అలంకరణ, బాలత్రిపుర సుందరి అలంకారంలో బీపీ అగ్రహారం గంగమ్మ

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొలిరోజు గురువారం శైలిపుత్రి అలంకారంలో అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో దసరా ఉత్సవాలకు శాస్త్రోక్తంగా వేద పండితులు కలశ స్థాపన చేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసిన కనకాచలంపై కనక దుర్గమ్మ ఆలయంలో ఆగమోక్తంగా కలశస్థాపన చేసి అమ్మవారిని విశేషంగా అలంకరించారు. శ్రీకాళ హస్తీశ్వరాలయంలో వెలసిన కనకదుర్గమ్మ స్వర్ణకవచాలంకృత అలంకారంలో, బొమ్మలకొలువులో జ్ఞానప్రసూనాంబ శైలపుత్రిగా దర్శనమిచ్చారు. సాయంత్రం జ్ఞానప్రసూనాంబను ఆలయంలో ఊరేగించారు. ముక్కంటి ఆల యానికి అను బంధంగా వెలసిన ముత్యాలమ్మ ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. శ్రీకాళహస్తి మండలంలోని వేడాం గ్రామంలో దక్షిణ కాళికాదేవి స్వర్ణకవచాలంకృత ఆనందభైరవిగా, పానగల్ గంగమ్మ ప్రత్యేక అలం కరణలో, బజారువీధిలోని కన్యకా పరమేశ్వరి శివపూజ అలంకారంలో, బహదూరు పేటలోని కన్యకాపరమేశ్వరి బాల వాసవిదేవిగా, పొన్నాలమ్మ అమ్మవారు బాల త్రిపురసుందరిగా, తెట్టు ప్రాంతంలోని నల్లగంగమ్మ, విశ్వబ్రాహ్మణవీధిలోని గంగమ్మ, ముత్యా లమ్మ గుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మిగా, బీపీ అగ్రహారం గంగమ్మ, పూసలవీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, పీవీరోడ్డులోని అంకమ్మ ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు. పిచ్చాటూరు రహదారిపై కొలువైన బంగారమ్మ, భాస్కర పేటలో వెలసిన చాముండేశ్వరిదేవి బాల త్రిపురసుందరిగా భక్తులను అనుగ్రహించారు.



బాలత్రిపుర సుందరిగా పొన్నాలమ్మ, కృష్ణారెడ్డి మండపంలో ప్రత్యేక అలంకరణలో కనకాచలం కనకదుర్గమ్మ, బొమ్మలకొలువలో శైలపుత్రిగా దర్శనమిస్తున్న జ్ఞానప్రసూనాంబ, స్వర్ణకవచాలంకృత అలంకారంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో కనకదుర్గమ్మ

సూపర్‌స్పెషాలిటీకి దీటుగా ప్రభుత్వ ఆస్పత్రి



సూపరింటెండెంట్‌తో మాట్లాడుతున్న సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: సూపర్ స్పెషాలిటీకి దీటుగా అధునాతన వసతులతో శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రిని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ల్యాబ్, కాన్పులవార్డు, అత్యవసర విభాగం, మెడికల్ వార్డులను తనిఖీ చేశారు. జనరల్ ఫిజీ యషన్‌కు ఇద్దరు వైద్యులు, పదిమంది స్టాఫ్ నర్సులు, ఆర్వో ప్లాంటు తదిరత సమస్యలు పరిష్క రించాలని సూపరింటెండెంట్ విజయలక్ష్మి ఆయన్ను కోరారు. మాస్కులకొరత ఉందని తెలియజేశారు. వెంటనే ఎమ్మెల్యే సొంత నిధులతో మాస్కులను అందజేసే ఏర్పాట్లు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఆస్పత్రి పరిసరాలను పారిశుధ్య కార్మికులతో రెండు రోజుల్లో శుభ్రం చేయిస్తామన్నారు. పాడైపోయిన ఆర్వోప్లాంట్ స్థానంలో మల్లాడి డ్రగ్స్ కంపెనీ నిధులతో ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. కాన్పుల వార్డులో త్వరలోనే 70 ఐటీయూ బెడ్లను ఏర్పాటు చేస్తామని చెప్పారు. టీడీపీ పట్టణాధ్యక్షులు విజయకుమార్, నాయకులు చెంచయ్య నాయుడు, కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పీజే చంద్రయ్యకు పలువురి నివాళి

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: శ్రీకాళహస్తి ఆర్యవైశ్య అన్నదాన సత్రం చైర్మన్, ముక్కంటి ఆలయ ధర్మకర్తల మండలి మాజీ సభ్యులు పీజే చంద్రయ్యకు పలువురు ప్రముఖులు ఘనంగా నివాళులు అర్పించారు. పీజే చంద్రయ్య బుధవారం రాత్రి మృతిచెందారు. గురువారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి టీడీపీ నాయకులతో కలిసి ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులు తెలిపారు. అలాగే మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, టీడీపీ నాయకులు విజయకుమార్, కంఠా రమేష్ తదితరులున్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలి



రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్షం నాయకులు

సత్యవేడు, అక్టోబరు 3: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. గురువారం సత్యవేడులో సీపీఎం, సీపీఐ, కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక గాంధీ విగ్రహం వద్ద విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలను కాపాడేందుకు విశాఖ ఉక్కును ప్రైవేట్ పరం చేయాలని చూస్తోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రగల్భాలు పలికిన రాష్ట్రంలోని కూటమి నేతలు ఇప్పుడు విశాఖ ఉక్కుపై ఒక్కమాటైన మాట్లాడకుండా ప్రైవేటీ కరణకు సహకరిస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32మంది ప్రాణత్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రజలందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అంబాకం చిన్నిరాజ్, సీపీఎం మండల కార్యదర్శి రమేష్, కాంగ్రెస్ నాయకుడు చెల్లదురై, ఏఐవైఎఫ్ కార్యదర్శి నాగార్జున, ఎస్ఎఫ్ఐ కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

కీళపూడిలో స్వచ్ఛతాహి సేవ

పిచ్చాటూరు, అక్టోబరు 3: మండలంలోని కీళపూడిలో గ్రామ కార్యదర్శి మహాలక్ష్మి, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం స్వచ్ఛతాహి సేవ కార్యక్రమం నిర్వహించారు. పిచ్చి మొక్కలు తొలగించారు. అలాగే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని అలంకరించారు. ప్రజలంతా పారిశుధ్యానికి సహకరించాలని కోరారు. పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

మండల పరిషత్ ఏఈగా ఇబ్రహీం ఖాన్

సత్యవేడు, అక్టోబరు 3: మండల పరిషత్ ఏఈగా ఇబ్రహీం ఖాన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. నంద్యాల జిల్లా కోవెలకుంట్ల పీఆర్ ఏఈగా పని చేస్తున్న ఇబ్రహీంఖాన్‌ను ప్రభుత్వం బదిలీలో భాగంగా సత్యవేడుకు బదిలీ చేసింది. దీంతో ఆయన ఇక్కడ బాధ్యతలు చేపట్టారు.

అనారోగ్యంతో ముక్కంటి ఆలయ ఉద్యోగి మృతి

శ్రీకాళహస్తి, అక్టోబరు 3: ముక్కంటి ఆలయ ఉద్యోగి రాజశేఖర్(35) అనారోగ్యంతో మృతిచెందాడు. శ్రీకాళహస్తికి చెందిన రాజశేఖర్ ఆలయంలో రికార్డు అసి స్టెంట్‌గా విధులు నిర్వహించేవాడు. గురువారం ఇంటి వద్ద అస్వస్థతకు గురై మృతి చెందాడు. ఆలయ అధికారులు, ఉద్యోగులు ఆయనకు సంతాపం తెలియజేశారు. ఆయన కుటుంబసభ్యులను పరామర్శించారు.

తూతూ మంత్రంగా గ్రామసభ

కేవీబీపురరం, అక్టోబరు 3: మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సభను వైసీపీ సర్పంచ్ వెంకటమ్మ, ఆమె కుమారుడు ఫీల్డ్ అసిస్టెంట్ కలిసి కార్యదర్శిని పిలిపించి తూతూమంత్రంగా సభ నిర్వహించారు. మళ్లీ సభ నిర్వహించాలని టీడీపీకి చెందిన యూత్ నాయకుడు బాబు తదితరులు కోరుతున్నారు.